కేకే నివాసానికి సీఎం రేవంత్ వచ్చినప్పుడు కరెంటు పోయిన దృశ్యం

కేకేతో సీఎం భేటీ.. 3 సార్లు కరెంటు కట్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): కరెంటు పోవద్దని మధ్యాహ్నమే అధికారులకు ఆదేశం..! సాయంత్రమే కేకేతో భేటీ సందర్భంగా మూడు సార్లు కరెంటు కట్..! ఇదీ శనివారం సీఎం రేవంత్‌కు ఎదురైన చేదు అనుభవం. శనివారం విద్యుత్తుపై సమీక్ష చేపట్టిన సీఎం.. రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ పెరిగిందని, నిమిషం కూడా కరెంట్ పోవద్దని అధికారులను ఆదేశించారు. సాయంత్రం బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ కేకే నివాసంలో భేటీ సందర్భంగా మూడు సార్లు కరెంటు పోయింది. ఏకంగా సీఎం హాజరైన సమావేశంలో కరెంటు పోవటంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు హతాశులయ్యారు. ఆగమేఘాల మీద వచ్చిన ఎస్పీడీసీఎల్ అధికారులు కరెంటును పునరుద్ధరించేందుకు ఆపసోపాలు పడ్డారు. దీంతో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కరెంటు కోతలు ఉండవద్దు

మొదటిపేజీ తరువాయి...

అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 'వేసవికాలం కావడంతో విద్యుత్ డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టు సరిపడా విద్యుత్ ఉన్నది. కాబట్టి డిమాండ్‌ను తీర్చే విధంగా అధికారులు సన్నద్ధం కావాలి. ఎక్కడైనా కరెంటు సమస్య ఉంటే తక్షణమే పరిష్కరించాలి. ముఖ్యంగా వేసవిలో విద్యుత్ సరఫరాపై అధికారులు ఓ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలి. కరెంటు పోయిందన్న ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలి' అని సూచించారు. గత ఏడాదిని మించి ఈ ఏడాది విద్యుత్తును సరఫరా చేయటంలో రాష్ట్రం కొత్త రికార్డును నమోదు చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మార్చి నెలలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని, పీక్ డిమాండ్ ఉన్నప్పటికీ కోతల్లేకుండా విద్యుత్‌ను అందించటంలో డిస్కంలు సమర్థవంతమైన పాత్ర పోషిస్తున్నాయని సీఎం ప్రశంసించారు. ఇందుకు కృషిచేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్కను అభినందించారు.

పర్యవేక్షణకు సీనియర్ అధికారి..

ప్రజలు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఏప్రిల్, మే, జూన్ వరకు స్థానికంగా గల నీటి వనరులను ఉపయోగించుకోవాలన్నారు. బావుల్లోని నీటిని తాగునీటి అవసరాలకు వాడుకోవాలని సూచించారు. తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు. సమస్యలున్న చోట పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో ఒక సీనియర్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో తాగునీటి కొరతను అధిగమించేందుకు వాటర్ ట్యాంకులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

ఏప్రిల్ వరకు 14వేల నుంచి 15వేలు..

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలో సగటున 9,712 మెగావాట్ల విద్యుత్తు లోడ్ నమోదువుతున్నదని, పీక్ డిమాండ్ గత రెండు వారాలుగా 14వేల మెగా వాట్ల నుంచి 15వేల మెగావాట్లుగా ఉంటున్నదని చెప్పారు. ఏప్రిల్ నెల రెండో వారం వరకు ఇంచుమించుగా ఇదే స్థాయిలో డిమాండ్ ఉంటుందని విద్యుత్తు అధికారులు అంచనా వేశారు. నిరుడు (2023) జనవరి నుంచి మార్చి వరకు సగటున రోజుకు 239.19 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం కాగా, 2024 జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల్లో రోజుకు సగటున 251.59 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా జరిగింది. గతేడాది మార్చి 14న 297.89 మిలియన్ యూనిట్ల సరఫరా అత్యధిక రికార్డు కాగా.. ఈ ఏడాది 308.54 మిలియన్ యూనిట్లతో కొత్త రికార్డు నమోదైంది.

సగం కరెంట్ కొనాల్సిందే

- ఎండల తీవ్రత నేపథ్యంలో పెరిగిన వినియోగం
- ప్రతిరోజు 150 మిలియన్ యూనిట్ల కొనుగోలు
- యాదాద్రి ప్లాంట్ పూర్తయితేనే స్వావలంబన

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): వేసవి తీవ్రత పెరుగుతున్నకొద్దీ విద్యుత్తు అవసరాలు కూడా భారీస్థాయిలో పెరుగుతున్నాయి. సగం కరెంట్‌ను ఇతర రాష్ట్రాల నుంచే కొనుగోలు చేయాల్సి వస్తున్నది. తాజా పరిస్థితుల ప్రకారం రాష్ట్రంలో రోజుకు 290 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగమవుతున్నది. దీంట్లో సగం మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతుండగా, 140- 150 మిలియన్ యూనిట్లను ఇతర రాష్ట్రాల నుంచి కొనాల్సి వస్తున్నది. ఈ ఏడాది జనవరి 30న 111.891 మిలియన్ యూనిట్ల విద్యుత్తును కొనుగోలు చేశారు. ఇటీవలే కాలంలో ఇదే అతి తక్కువ. ఆ తర్వాత రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో కొనుగోలుచేయాల్సిన విద్యుత్తు రోజుకు 140 మిలియన్ యూనిట్లు దాటుతున్నది. మార్చి 26న అత్యధికంగా 151 మిలియన్ యూనిట్ల విద్యుత్తును కొనుగోలు చేసింది.

యాదాద్రి పూర్తయితేనే..

రాష్ట్రంలో విద్యుత్తు సమస్యల తీరాలన్నా.. ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసే పరిస్థితులు మారాలన్నా యాదాద్రి విద్యుత్తు ప్లాంటు అందుబాటులోకి రావాలి. నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యం గల ఈ ప్లాంట్‌లో ఇప్పటికే 1600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లు ట్రయల్‌రన్‌కు సిద్ధంగా ఉన్నాయి. ఇటీవలే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నల్లగొండ జిల్లా మంత్రులు ఈ ప్లాంట్‌ను సందర్శించారు. జూన్ లేదా జూలైలో రెండు యూనిట్లు ప్రారంభించే అవకాశముంది. మిగతా మూడు యూనిట్ల నిర్మాణం పూర్తయ్యి వినియోగంలోకి వస్తే రాష్ట్రంలో విద్యుత్తు రంగంలో సాధికారత సాధించవచ్చని అధికారులంటున్నారు.

గత వారం రోజుల్లో కొనుగోలు చేసిన విద్యుత్తు వివరాలు

తేదీ	కొనుగోలు (మిలియన్ యూనిట్లు)
28-3-24	144.154
27-3-24	146.568
26-3-24	151.59
25-3-24	145.634
24-3-24	145.764
24-3-24	143.67
23-3-24	147.033

ఈ నెల 28న సరఫరా చేసిన విద్యుత్తు వివరాలు (మిలియన్ యూనిట్లలో)

జెన్‌కో థర్మల్	79.505
జెన్‌కో హైడల్	2.28
సింగరేణి థర్మల్	25.128
ఎన్‌సీఈఎ, ఇతరులు	39.814
కొనుగోలు చేసింది	144.154

3నెలల్లోనే 18,100కోట్లు

- ఇదీ రేవంత్ సర్కారు అప్పుల చిట్టా
- రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందంటూనే ఇబ్బడి ముబ్బడిగా రుణాల సమీకరణ
- అయినా 'రైతుబంధు'కు గ్రహణం
- 'మహాలక్ష్మి'కి నిధులు నామమాత్రంగా పంపిణీ
- ఆర్టీసీకి ఇవ్వాల్సిన రూ.900 కోట్లలో రూ.100 కూడా విదల్చని వైనం

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందంటూనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా రుణాలు తెస్తున్నది. అలా గత 3 నెలల్లోనే ఏకంగా రూ.18,100 కోట్ల అప్పులు తెచ్చింది. ఇందులో రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) నుంచి 9 విడతల్లో రూ.15,100 కోట్లు, హడ్కో నుంచి మరో రూ.3,000 కోట్లు సమీకరించింది. ఆర్బీఐ నుంచి ప్రతి విడతలో రూ.1,000 కోట్లకు తగ్గకుండా నెలకు సగటున రూ.6,000 కోట్లకుపైగా రుణాలు తీసుకొచ్చినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ లెక్కన రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.50 వేల కుపైగా అప్పులు చేయడం ఖాయంగా కనిపిస్తున్నది. దీంతో ఇంత భారీగా రుణాలు తీసుకురావడం రాష్ట్రానికి ఏమాత్రం మంచిది కాదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ అప్పులను ఎలా తీరుస్తారని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత భారీగా అప్పులు తెచ్చినప్పటికీ ఆ సొమ్మును దేనికి వెచ్చిస్తున్నదో ఎవరికీ అంతుచిక్కడం లేదు. రైతుబంధు పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయని రేవంత్ సర్కారు.. ఎంతో ఆర్భాటంగా చెప్పుకొంటున్న 'మహాలక్ష్మి' (ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి) పథకానికీ నిధులు విదల్చడం లేదు. ఈ పథకం అమలు కోసం ప్రతినెలా దాదాపు రూ.300 కోట్ల చొప్పున గత 3 నెలల్లో ఆర్టీసీ యాజమాన్యానికి మొత్తం రూ.900 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటివరకు కనీసం రూ.100 కోట్లు కూడా విడుదల చేయలేదని అధికారులు వాపోతున్నారు. దీంతో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చిన 6 గ్యారెంటీల అమలు పూర్తిగా అటకెక్కే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పీఆర్సీ బకాయిలు 750 కోట్లు

ఇన్సూరెన్స్, మెడికల్ బిల్లులూ పెండింగ్‌లోనే

అల్లాడిపోతున్న ప్రభుత్వ ఉద్యోగులు

ముఖం చాటేస్తున్న రేవంత్ సర్కారు

నిధులను బట్టి చెలిస్తున్నామంటున్న అధికారులు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించిన బకాయిలు రూ.750 కోట్ల వరకు పేరుకుపోయాయి. దీనిపై దాదాపు 3 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఆర్సీ బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని, వారి సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు. వేతన సవరణ కమిషన్ సిఫారసుల ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు వారి వేతన

స్కేళ్లను బట్టి కనిష్ఠంగా రూ.20 వేలు, గరిష్ఠంగా రూ.35-40 వేలు, సగటున రూ.25 వేల చొప్పున మొత్తం రూ.750 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటిపోయినా ఈ బకాయిల ఊసెత్తడం లేదు. దీనిపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ పెద్దలను, అధికారులను సంప్రదించినా ఎలాంటి ఫలితం లేకపోయిందని, ఉద్యోగులు వాపోతున్నారు. పీఆర్సీ బకాయిలకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ చెల్లింపులపై ఆర్థిక, ట్రెజరీ శాఖల అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. దీంతో ఉద్యోగుల పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు చావా రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇన్సూరెన్స్ బకాయిలు రూ.80 కోట్లు.. మెడికల్ బిల్లులు రూ.50 కోట్లు

రాష్ట్రంలో పీఆర్‌సీ బకాయిలతోపాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఇన్సూరెన్స్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు కూడా భారీగా పేరుకుపోయాయి. వీటిలో ఇన్సూరెన్స్ బకాయిలు దాదాపు రూ.80 కోట్ల వరకు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు రూ.50 కోట్లకుపైగా ఉంటాయని స్వయంగా ఆర్థిక శాఖ అధికారులే అంగీకరిస్తున్నారు. ఈ బకాయిల చెల్లింపులను కూడా ప్రభుత్వం నిలిపివేసిందని ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లులపై ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు జరిపి, అనుమతి మంజూరు చేసినప్పటికీ ఆర్థిక శాఖ నుంచి ఆ డబ్బులు తమ ఖాతాల్లో జమ కావడం లేదని వాపోతున్నారు. అయితే, నిధుల లభ్యతను బట్టి ఉద్యోగ, ఉపాధ్యాయులకు బిల్లులు క్రమంగా చెల్లిస్తున్నామని, అవి క్రమంగా క్లియర్ అవుతున్నాయని ఆర్థిక శాఖ అధికారులు చెప్తున్నారు.

బిల్లుల కోసం బాధితుల చక్కర్లు

- ఆర్థిక సంవత్సరం చివరిరోజు సచివాలయంలో పడిగాపులు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఆర్థికశాఖ వద్ద కుప్పలు తెప్పలుగా ఉన్న పెండింగ్ బిల్లుల చెల్లింపు గడువు శనివారంతో ముగిసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పెండింగ్ బిల్లుల చెల్లింపులు పూర్తిస్థాయిలో జరగలేదు. మెడికల్ బిల్లులు, ఎరియర్స్, ఇన్సూరెన్స్, జీపీఎఫ్ ఇతర అనేక రకాల బిల్లుల కోసం బాధితులు ఎంతో ఆశతో రాష్ట్ర సచివాలయంలోని ఆర్థికశాఖ అధికారుల వద్ద పడిగాపులు కాశారు. చివరకు ప్రయోజనం లేదని తెలుసుకొని ఆవేదనతో వెనుదిరిగి వెళ్లిపోయారు. బిల్లుల చెల్లింపుల కోసం బాధితుల నుంచి టోకెన్ల పేరుతో ఫిర్యాదులు స్వీకరించారు. కానీ వాటిలో చాలా తక్కువ సంఖ్యలో క్లియర్ చేసినట్టు తెలిసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పెండింగ్ బిల్లుల చెల్లింపునకే ప్రాధాన్యం ఇస్తామని ఉద్యోగులకు అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించే అంశంలో సీఎం, డిప్యూటీ సీఎం స్పందించి తమకు తగిన న్యాయం చేయాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

బీజేపీకి 'సహాయ నిరాకరణ' గండం

- వలస నేతలకు టికెట్లపై పార్టీలో అంతర్గత పోరు
- మాకెందుకివ్వరంటూ సొంత నేతల అలక
- ఎన్నికల్లో తడాఖా చూపిస్తామంటూ హెచ్చరిక
- బుజ్జగించే ప్రయత్నాల్లో కాషాయ అధిష్ఠానం

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీజేపీకి సొంత నేతల నుంచే సహాయ నిరాకరణ ఎదురవుతున్నది. కొన్ని చోట్ల వలస నేతలకు టికెట్లు ఇవ్వడంతో ఆయా నియోజకవర్గాల్లో అప్పుడే అసమ్మతి మొదలైంది. కొందరు నేతలు బహిరంగంగానే తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా రాష్ట్ర నాయకత్వం వద్దే తమ వ్యతిరేకతను వెల్లడిస్తున్నారని సమాచారం. ఇప్పటికే వలస నేతలకు టికెట్లిచ్చిన అనేక నియోజకవర్గాల్లో సీనియర్లు, పాతతరం కార్యకర్తలు 'మాకేం సంబంధం లేదు' అన్నట్టుగా అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని చెప్తున్నారు. 'దశాబ్దాలుగా పార్టీని నమ్ముకొని ఉన్నవాళ్లను కాదని, నిన్నగాక మొన్న చేరినవారికి టిక్కెట్టిచ్చి మమ్మల్ని అవమానిస్తారా?' అంటూ తీవ్రస్థాయిలో మండిపడుతున్నట్టు తెలుస్తున్నది. తాము ఏండ్లకేండ్లు కష్టపడి, వ్యవస్థలపై పోరాడి, కేసులు ఎదుర్కొని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తే.. ఇన్నాళ్లూ తమను తిట్టిన వారినే తెచ్చి తమ నెత్తిపై రుద్దుతున్నారని నేతలు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఇటీవల నల్లగొండ టికెట్‌ను సైదిరెడ్డికి ఇవ్వొద్దని రాష్ట్ర కార్యాలయంలో ఆ జిల్లా నేతలు నిరసన తెలుపడమే ఇందుకు ఉదాహరణ. మరోవైపు పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నప్పుడైనా తమకు అవకాశాలు వస్తాయని భావించామని, కానీ డబ్బున్న వారికే టికెట్లు కేటాయిస్తున్నారంటూ మరికొందరు నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 'పార్టీలు మారకుండా సిద్ధాంతం కోసం పనిచేయడమే మేం చేసిన పాపమా?' అంటూ కొందరు సీనియర్ నేతలు వాపోతున్నారు. డబ్బున్న వాళ్లకే సీట్లిచ్చే సంస్కృతి తమ పార్టీలోనూ మొదలైందని ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో బీజేపీ రాష్ట్ర నేత ఒకరు వ్యాఖ్యానించారు. టికెట్ ఇస్తేనే వస్తామని నిబంధన పెట్టి మరీ వస్తున్నవారు కూడా ఉన్నారని వాపోయారు. శ్రేణుల్లో నిర్వేదం నిజమేనని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తమకు జరిగిన అన్యాయంపై పలువురు నేతలు రాష్ట్ర నాయకత్వం వద్ద ఏకరువు పెట్టినా అధిష్ఠానం చేతులెత్తేయడంతో, లోక్‌సభ ఎన్నికల్లో సహాయ నిరాకరణే అస్త్రంగా వివిధ నియోజకవర్గాల్లో పలువురు నేతలు సిద్ధమైనట్టు చర్చ జరుగుతున్నది.

ఫలించని బుజ్జగింపులు..

అధిష్ఠానం సతమతం

రాష్ట్రంలో దశాబ్దాలుగా పనిచేస్తున్న నికార్సైన కార్యకర్తలకు అవకాశాలు ఇవ్వకుండా సూక్తులు చెప్పి మభ్యపెడుతున్నారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'నికార్సైన బీజేపీ కార్యకర్తలు టిక్కెట్ అడగరని, పార్టీ ఇస్తే తీసుకుంటా అనుకునే వాళ్లే పరిపూర్ణమైన కార్యకర్తలు' అంటూ తమకు సూరిపోస్తున్నారని మండిపడుతున్నారు. 'త్యాగాలు లిఖించబడుతాయి.. గుణించబడతాయి' అంటూ కాకమ్మ కబుర్లు చెప్తున్నారని, ఎన్నికల వేళ కాకుండా ఇంకెప్పుడు తమకు అవకాశాలు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. సూక్తులన్నీ చెప్పి తరాలుగా తమను కార్యకర్తలుగానే మిగుల్చుతున్నారని, వలస నేతలకు అందలం ఎక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అసంతృప్తి ఇలాగే కొనసాగితే లోక్‌సభ ఎన్నికల్లో గట్టి దెబ్బ తగలడం ఖాయమనే భావనకు అధిష్ఠానం వచ్చినట్టు తెలిసింది. బుజ్జగించే ప్రయత్నాలు ఎక్కడా ఫలించడం లేదని, ఎలా సముదాయించాలో తెలియక నేతలు సతమతం అవుతున్నారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

హిందూ మహా సముద్రంలో 'గ్రావిటీ హోల్'

- శిలాద్రవం కారణంగా ఏర్పాటు!

న్యూఢిల్లీ : హిందూ మహా సముద్రంలో భూమి గురుత్వాకర్షణ శక్తి బలహీనంగా ఉండే ప్రదేశం విస్తారంగా ఉంది. దీనిని గ్రావిటీ హోల్ అంటారు. దీనివల్ల సముద్ర తలం 328 అడుగులకుపైగా కుంగిపోతుంది. భూమి అట్టడుగు నుంచి వచ్చే శిలాద్రవం (మాగ్మా) వల్ల ఇది ఏర్పడినట్లు పరిశోధకులు చెప్తున్నారు. అగ్ని పర్వతాలు ఏర్పడటానికి కారణమయ్యే శిలాద్రవం వంటిదే ఇది కూడానని అంటున్నారు. 14 కోట్ల సంవత్సరాల క్రితంనాటి పరిస్థితులను సూపర్ కంప్యూటర్ల ద్వారా మదింపు చేసి ఈ నిర్ధరణకు వచ్చామని చెప్తున్నారు. ఈ అధ్యయన వివరాలు 'జియోఫిజికల్ రీసెర్చ్ లెటర్స్' జర్నల్‌లో ప్రచురించారు. భారత దేశ దక్షిణాగ్రం నుంచి ఈ గ్రావిటీ హోల్ ప్రారంభమైందని, 1.2 మిలియన్ల చదరపు మైళ్ల వరకు విస్తరించిందని, దీనిని మొదట డచ్ జియోఫిజిసిస్ట్ ఫెలిక్స్ అంద్రీస్ వెనింగ్ మెయినెస్జ్ 1948లో గుర్తించారని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారానికి టీపీసీసీ కమిటీ

కమిటీలో జానారెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, సంపత్‌కుమార్

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి టీపీసీసీ కమిటీ ఏర్పాటైంది. సీఎల్పీ మాజీనేత జానారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌తో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఈ కమిటీ ఏర్పాటు చేశారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో నాయకుల మధ్య ఏర్పడిన అభిప్రాయ భేదాలు, ఫిర్యాదులను ఈ కమిటీ పరిష్కరిస్తుంది. నాయకులు తమ ఫిర్యాదులను కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని రేవంత్‌రెడ్డి సూచించారు. పార్టీ అంతర్గత వ్యవహారాలు, క్రమశిక్షణ రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఫిర్యాదు పరిష్కారానికి పార్టీ సిద్ధంగా ఉండాలని నేతలకు సూచించారు.

గాంధీభవన్‌లో జాతీయ కాంగ్రెస్ మ్యానిఫెస్టో సమావేశం

జాతీయ కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ సమావేశం మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన శనివారం గాంధీభవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించి జాతీయ మ్యానిఫెస్టోలో పొందుపరచాల్సిన అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఏపీ విభజనచట్టంలో తెలంగాణకు హక్కుగా రావాల్సిన అంశాలు, ప్రాంతీయ ఎయిర్ పోర్టులు, వరంగల్ ఎయిర్ పోర్టు ఆధునీకరణ, సింగరేణి రైల్వే, స్పోర్ట్స్ యూనివర్సిటీ తదితర అంశాలపైనా చర్చించారు. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల ప్రచారం కోసం కాంగ్రెస్ విడుదల చేసిన 27 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఉన్నారు.

బీజేపీ మైనార్టీ వ్యతిరేక చర్యలకు బీఆర్ఎస్ మద్దతు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): బీజేపీ మైనార్టీ వ్యతిరేక చర్యలకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తున్నదని పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 48 గంటల్లో పడగొడతామన్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, బీజేపీ నేతల వ్యాఖ్యలు చూసి తెలంగాణ సమాజం విస్తుపోతున్నదని చెప్పారు. కాంగ్రెస్‌లోకి ఎవరినీ బలవంతంగా తీసుకోవడం లేదని, తెలంగాణ పునర్నిర్మాణం కోసమే వారిని పార్టీలోకి చేర్చుకుంటున్నట్టు తెలిపారు. కర్ణాటకలో బీజేపీకి పట్టిన గతే తెలంగాణలోనూ పడుతుందని హెచ్చరించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులతో లక్షల కోట్లు వృథా చేశారని ఆరోపించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఏక్‌నాథ్‌షిండే అనడం విడ్డూరమన్న ఆయన.. తెలంగాణ కోసం పదవిని వదులుకున్న వ్యక్తి కోమటిరెడ్డి అని ప్రశంసించారు.

ఎన్నికల వేళ .. మావోయిస్టులపై నిఘా

ఐదు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సంఘ విద్రోహశక్తులు, మావోయిస్టుల కదలికలపై పూర్తిస్థాయిలో నిఘా కొనసాగించాలని కేంద్ర ఎన్నికల అధికారులు ఆదేశించారు. ఇటీవల మావోయిస్టుల కార్యకలాపాలు పెరిగిన నేపథ్యంలో.. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ముంబైలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ నుంచి అడిషనల్ డీజీలు శివధర్‌రెడ్డి, సంజయ్‌కుమార్ జైన్, మహేశ్ భగవత్ హాజరయ్యారు. ఎన్నికల బందోబస్తు ఏర్పాట్ల వివరాలను ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్, సంఘ విద్రోహ శక్తులపై నిఘా వివరాలను ఇంటెలిజెన్స్ ఏడీజీ శివధర్‌రెడ్డి వివరించారు. ఎన్నికల వేళ.. పట్టుబడుతున్న నగదు, మద్యం, బంగారం, డ్రగ్స్, ఇతర ఉచితాల వివరాలను ఏడీజీ మహేశ్ భగవత్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు ఎన్నికల సంఘం అధికారులు పలు సూచనలు చేసినట్లు తెలిసింది. కాగా ఈ సమావేశానికి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల అధికారులు ఆన్‌లైన్ మీటింగ్ ద్వారా హాజరైనట్లు సమాచారం.

15 రోజులైనా ఒక్క నోటు దొరకలేదా?

- నగదు సీజ్ మొదలుపెట్టని ఎస్పీలపై డీజీపీ ఫైర్!

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : 'ఎన్నికల కోడ్ వచ్చి 15 రోజులు పైగా అవుతుంది. మీ జిల్లాల్లో ఒక్క నోటు కూడా దొరకలేదా? మీరు బందోబస్తు నిర్వహిస్తున్నారా? లేక....' అంటూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా పలు జిల్లాల ఎస్పీలు, సీపీలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎక్కడిక్కడ పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈనెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 375 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 375 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన తనిఖీలు చేపడుతున్నారు. సరిహద్దులో ఉన్న ఖమ్మం వంటి సుమారు పది జిల్లాల్లో నేటికీ ఒక్క నోటు కూడా పట్టుబడకపోవడంపై డీజీపీ సీరియస్ అయ్యారు. ఖమ్మం కమిషనర్, మెదక్ సహా.. డబ్బులు అతి తక్కువగా పట్టుబడుతున్న జిల్లాల ఎస్పీలకు ఫోన్‌లోనే తలంటినట్లు సమాచారం. రవాణా శాఖ, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, అటవీశాఖల చెక్‌పోస్టుల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ.. పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని డీజీపీ మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లుగా తెలిసింది.

ప్రజలను మోసం చేయడంలో రేవంత్ దిట్ట

- ఆయన ఇంకా ప్రతిపక్ష నేతలా మాట్లాడుతున్నడు
- మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

మాగనూర్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

మాగనూరు, మార్చి 30 : ప్రతి ఎన్నిల్లో డ్రామాలు చేయడం, ప్రజల